www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 నవంబర్ 2025



మంత్రి ఛాలెంజ్‌ను స్వీకరిస్తున్నా : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పాలంటే దమ్ము అవసరం లేదని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయచోటి అభివృద్ధిపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేసిన ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నానన్నారు. మంత్రి ఎంత మంది అధికారులతో వచ్చినా తగిన రికార్డులు, ఆధారాలతో తాను వచ్చి జరిగిన అభివృద్ధిని చూపిస్తానని చెప్పారు. తాను గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూపిస్తాను కూటమి ప్రభుత్వంలో 18 నెలలుగా మీరేమి అభివృద్ధి చేశారో చూపగలరా అంటూ ప్రశ్నించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి రాయచోటి ప్రాంతంపై అభిమానం ఉంటే ఆదోని ఎమ్మెల్యే ఈ ప్రాంతాన్ని చులకన చేసి మాట్లాడినప్పుడు అసెంబ్లీలో ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. ఆరోజు ఆదోని ఎమ్మెల్యేకి ఛాలెంజ్ విసిరి ఉంటే బాగుండేదన్నారు. జిల్లా విభజన జరుగ బోతోంది దానిని నిలిపేస్తానంటూ ఛాలెంజ్ చేయాలని కోరారు. అనవసరంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ తొడలు కొడతాం, జబ్బలు చరుస్తాం అంటే అది అభివృద్ధికి కిందకు వస్తుందా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష, వైసిపి నేతలు బేపారి మహమ్మద్ ఖాన్, కొలిమి హారున్‌బాష, సాదక్ అలీ, జిఎండి ఇమ్రాన్, రియాజుర్ రహ్మాన్, నవాజ్ క్రిష్, బుజ్జిబాబు, జాకీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి
- పనిభారాన్ని పెంచే యాప్‌లను తొలగించాలి
- అంగన్వాడీ యూనియన్ 2వ జిల్లా మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగన్వాడీల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ హెల్పర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. మదనపల్లె పట్టణంలోని సిఎస్ఐ జెసిఎం కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా రెండవ మహాసభ ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ హాజరయ్యారు. ముందుగా సిఐటియు జెండాను ఎగురవేసి విప్లవ వందనాలు చేశారు. అనంతరం అంగన్వాడీ యూనియన్‌లో క్రియాశీలక పాత్ర పోషించి అమరులైన ఖాజాబీ, కవితలకు విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సుబ్బారావమ్మ మాట్లాడుతూ ఐసిడిఎస్ వ్యవస్థ ఏర్పడి ఇప్పటికి 50 ఏళ్లు గడుస్తోందని తెలిపారు. అప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్ష మంది అంగన్వాడీలు చిన్నపిల్లల సేవలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు అంగన్వాడీల పట్ల చిన్నచూపు ప్రదర్శించి నామమాత్రపు జీతాలతో వెట్టిచాకరి చేయించుకోవడంతో సిఐటియు అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేసుకొని



సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

పోరాటాలు చేయడంతో కొన్ని ఫలితాలను సాధించుకున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీలు ఐకమత్యంగా ఉంటూ హక్కుల సాధన కోసం పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. పాలక ప్రభుత్వాలు అంగన్వాడీలపై క్రమంగా పనిభారాన్ని పెంచుతూ వేధింపులకు దిగుతోందన్నారు. నోట్ కెమెరా, ఫేస్ యాప్, ఫొటో యాప్, తదితర యాప్‌ల ద్వారా వేధింపులకు గురిచేస్తూ పనిభారాన్ని పెంచి వెట్టిచాకిరీ చేయించుకోవడమే తప్ప పనితగ్గ వేతనాలను మాత్రం పెంచడం లేదన్నారు. నాణ్యమైన, పోషక విలువలుండే భోజనం పెట్టేందుకు నిధులు పెంచాలన్నారు. 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కార్మికుల స్థితిగతులను గమనించి, రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా మనమంతా సంఘటితమై మన హక్కుల సాధనకోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ సిఐటియును బలోపేతం చేసుకోవడం వల్ల ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టవచ్చునన్నారు. ప్రభుత్వాలు ఉద్యమాలను అణిచి వేసే ధోరణిలో కుట్రలు పన్నుతోందని వాటిని మనం ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే స్వేచ్ఛగా ఉద్యోగం చేసుకునే పరిస్థితి ఉంటుందన్నారు. ఇందుకు నిదర్శనమే అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో 42 రోజులు నిరవధిక సమ్మె చేపట్టి సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మిదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరిదేవి, జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, కోశాధికారి హరినాథ్ శర్మ, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, మదనపల్లె సెక్టార్ నాయకులు మధురవాణి, గౌరి, గంగాదేవి, శ్రీవాణి, ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ అధిక సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వినియోగదారులకు నిరంతర విద్యుత్ : సిఇ

ప్రజాశక్తి-పీలేరు

విద్యుత్ వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సౌకర్యం కల్పించడం విద్యుత్ సంస్థ ప్రధాన బాధ్యతని ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ ఇంజినీర్ పి.సురేంద్ర నాయుడు తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ముఖ్యమైన అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు వినియోగదారులకు నిరంతరం విధిగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ నియంత్రికల మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ నియంత్రికల పరిరక్షణకు కావలసిన పరికరాలు అమర్చాలని హెచ్‌జి ఫ్యూస్ సెట్స్ సాలిడ్ కోర్ ఇన్సులేటర్స్‌ల గురించి వివరించారు. 33 కెవి, 11 కెవి లైన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అవసరమైన చోట చెట్లు, కొమ్మలు, తీగలు తొలగించాలని, వినియోగదారులకు అవసరమైన మరమ్మతులను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం సంకల్పించిన ఇంటింటా సౌర విద్యుత్, ఇవి చేంజింగ్ స్టేషన్‌లు, స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు అనుకూలంగా అన్నీ పటిష్టంగా అమలుపరచాలన్నారు. విద్యుత్ సిబ్బంది అందరూ కలిసి వినియోగ దారులకు సంతృప్తి పరిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజల్లో విద్యుత్ సంస్థ పట్ల విశ్వాసం తిరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో డిఇఇలు ఇంజినీర్లు వై.చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, విజయ భాస్కర, దామోదర్, పట్టణ, రూరల్ ఎఇలు రామ్మూర్తి, ఇలాహి, ఎస్‌ఎం రఫీ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ సురేంద్ర నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

త్వరలో మదనపల్లె జిల్లా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె వాసుల చిరకాల వాంఛ నెరవేరబోతుందని, త్వరలో మదనపల్లె జిల్లా ఏర్పాటు అవుతోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అట్టడుగు స్థాయికి వెళ్లిపోయిందన్నారు. గత పాలనంతా మసిపూసి మారేడు కాయ అన్న చందంగా సాగిందని విమర్శించారు. ఇక్కడి ప్రాంతవాసులుమదనపల్లె జిల్లా సాధనకోసం అలుపెరగని పోరాటం చేసి ఉద్యమిస్తే అక్రమ కేసులు పెట్టారని, తనపై 8 కేసులు బనాయించారన్నారు. మద్రాసు పాలనలోనే మదనపల్లెకు జిల్లా కావాల్సిన అన్ని హంగులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రతిసారి మదనపల్లి ప్రజలు మోసపోతూనే ఉన్నారన్నారు. గత వైసిపి పాలనలో జిల్లాల ప్రక్రియ చేపట్టినప్పటికీ మదనపల్లి జిల్లా ప్రకటించకుండా హాస్యాస్పదం చేశారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో మదనపల్లె కు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మదనపల్లె జిల్లా చేస్తానని మాట ఇంచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం మదనపల్లి జిల్లా సహకారం అవుతోందని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని వర్గాల ప్రజలకు, అన్ని ప్రాంతాలకు సమాన న్యాయం చేస్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రతినెలా రూ.4 వేలు భరోసా పెన్షన్లు అందిస్తూ, తల్లికి వందనం ప్రతీ విద్యార్థికి అందించడం జరిగిందన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో ప్రతీనెలా రూ.20 కోట్లు పెన్షన్లు అందుతున్నాయని, రూ.50 కోట్లు తల్లికి వందనం నిధులు వచ్చాయన్నారు. నిర్వీర్యమైన వ్యవస్థలను గాడిలో పెడుతూ రాష్ట్రాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు రాష్ట్రాలకు దిక్సూచి మారారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు విద్యాసాగర్, నవీన్ చౌదరి, బాలు స్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని వినతి

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేటలో జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, టిడిపి మాజీ మండల అధ్యక్షులు బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్విభజన కమిటీ చైర్మన్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి తదితరులను వారి కార్యాలయాల్లో కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా కేంద్రం సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు జిల్లా కేంద్ర సాధన సమితి కన్వీనర్ తరిగోపుల లక్ష్మీనారాయణ తెలిపారు. తప్పక న్యాయం చేస్తామని మంత్రులు వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-రాజంపేట

అన్ని ఇంద్రియాలలోకి నేత్రాలే అత్యంత ప్రధానమని శ్రీచైతన్య ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌ఎస్ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎజిఎం రమణయ్య, ఇండియా కో-ఆర్డినేటర్ సతీష్ ఆధ్వర్యంలో అగర్వాల్ నేత్రాలయం వైద్య సిబ్బందిచే విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పోషకాహార లోపం వలన చిన్నతనంలోనే నేత్ర సమస్యలు వస్తున్నాయని, వాటిని అధిగమించేందుకు సమతుల ఆహారం తీసుకుంటూ మొబైల్ స్క్రీన్, కంప్యూటర్, టివి వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. స్మార్ట్ లివింగ్-ఫిట్ ఇండియా కార్యక్రమం ద్వారా తమ పాఠశాల విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ మదన్, వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ శ్రీనివాసులు, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి పెంచలయ్య, ప్రైమరీ ఇన్‌ఛార్జి సంధ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని జియాన్ ఇఎన్‌టి పాయింట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి 103 మంది ప్రజలు ఈ వైద్య శిబిరానికి విచ్చేసి వైద్య సేవలను ఉపయోగించుకున్నారు. ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ పాల్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ ఎలియాజర్ రాజ, డాక్టర్ షాహిస్తా, కాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ జషిరూన్, దంత వైద్య నిపుణులు డాక్టర్ సోఫియా, డాక్టర్ శ్వేత పాల్గొని వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి చికిత్సలు అందించారు. 30 మందికి ఆడియోగ్రామ్ ఉచితంగా చేయడంతో పాటు పదిమందికి ఎక్స్‌రే తీశారు. 20 మందికి రక్త పరీక్షలు చేశారు. పరీక్షలు చేయించుకున్న 103 మందికి ఉచిత మందులు పంపిణీ చేయడంతో వైద్య శిబిరంలో వచ్చిన ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల జరిగిన ఈ వైద్య శిబిరంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారన్నారు. వాతావరణంలో మార్పులు చేసుకోవడం వల్ల సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వైద్యులు సూచించిన సలహాలు సూచనలు పాటించాలని కోరారు. హాజరైన వైద్యులకు దన్యవాదాలు తెలియజేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

శ్రీచరణికి ఘన సత్కారం

కడప నగరంలో భారీ ర్యాలీ
దారిపొడవునా అభినందనల వెల్లువ



శ్రీచరణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి



శ్రీచరణి సన్మాన కార్యక్రమానికి హాజరైన క్రికెట్ క్రీడాకారులు

ప్రజాశక్తి-కడప

దేశానికి మొట్ట మొదటి ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ సాధించడంలో కీలకపాత్ర పోషించి, కడప జిల్లా ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టి, మొట్టమొదటి సారిగా కడప జిల్లా వాసి నల్లపురెడ్డి శ్రీచరణికి కడపకు వచ్చిన సందర్భంగా నగర శివార్లలోని ఆలంఖాన్‌పల్లి వద్ద శుక్రవారం రాత్రి 7.30 గంటలకు ఆమెకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి రెడ్డిప్రసాద్, ఎసిఎ సౌత్ జోన్ కన్వీనర్ సంజయ్ కుమార్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, ముని కుమార్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఘనం స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా హెడ్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ చేరుకుంది. నిర్వాహకులు ముందుగా సాయంత్రం 4 గంటలకు వస్తుందని ప్రకటించారు. రోడ్డు మార్గాన వస్తుండడంతో ఆలస్యం కావడంతో నిర్వాహకులు 6 గంటలకు వస్తుందని ప్రకటించారు. శ్రీచరణి రాక ఆలస్యమైనా పెద్ద ఎత్తున ప్రజలు ఆమె రాక కోసం ఎదురు చూశారు. రాత్రి 7.30 గంటలకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో వైఎస్‌ఆర్ కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలకరించిన గుర్రాలు రథంలో శ్రీచరణిని కూర్చోబెట్టి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున క్రికెట్ క్రీడాకారులు, స్పోర్ట్స్ స్కూల్, వ్యాయామ కళాశాల, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు క్రికెట్ అభిమానులు, చిన్నా, పెద్ద తేడాలేకుండా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని దారిపొడవున నిలబడి జాతీయ పతాకాలు, శ్రీచరణి ఫొటోతో కూడిన ప్లకార్డులు పట్టుకుని జేజేలు పలుకుతూ ర్యాలీలో పాల్గొని ఘనస్వాగతం పలికారు. క్రీడాభిమానులు దారిపొడవునా శ్రీచరణిపై పూల వర్షం కురిపించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ర్యాలీ పోస్టు ఆఫీసు సర్కిల్ నుండి ఏడు రోడ్ల సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్ మీదుగా రాజీవ్‌మార్గ్ వరకు సాగింది. ర్యాలీలో జాతీయ గీతాలు, భారత్ మాతకు జై అంటూ నినాదాలు, బాణాసంచా, వాయిద్యాలతో నగరం మార్మోగింది. అనంతరం ఎసిఎ క్రికెట్ స్టేడియంలో శ్రీచరణిని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో మేయర్ ముంతాజ్‌బేగం, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కడప, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, శ్రీచరణి తల్లిదండ్రులు చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక, క్రీడాకారులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీలో శ్రీచరణి, ఆమె తల్లిదండ్రులు



శ్రీచరణి, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న జిల్లా క్రికెట్ అసోషియేషన్ సభ్యులు



తల్లిదండ్రులు, సోదరితో శ్రీచరణి

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచండి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం పీలేరు మండలం తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రికి సంబంధించిన ఒపి రిజిస్టర్, డిస్పెన్సరీ రిజిస్టర్ తదితర రిజిస్టర్‌లను పరిశీలించి ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నలు అడిగారు. చిన్న పిల్లలకు టీకాలు ఎప్పుడు ఎప్పుడు వేస్తున్నారు ఎలా వేస్తున్నారు వంటి ప్రశ్నలు అడిగారు. చిన్న పిల్లలకు వేసే టీకాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారా లేదా టీకాలు వేసే తేదీలపై ప్రజలకు ముందుగానే తెలియజేస్తున్నారా లేదా వంటి ప్రశ్నలు అడిగారు. రక్తహీనత ఉన్న 68 కేసులు ఎందుకు వచ్చాయని ఆసుపత్రి సిబ్బందిని అడిగి కొత్త హీనత లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల ఇంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఎందుకు జరగలేదని ఆసుపత్రి సిబ్బందిని అడిగి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరగాలని ఆదేశించారు. గడువు ముగిసిపోయిన ఇంజక్షన్లు లేదా మందులు ఆసుపత్రిలో ఉండకూడదని ఆదేశించారు. ఆసుపత్రిలో వసతులు బాగా ఉండాలని, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

విద్యతో పాటు క్రీడలూ అవసరమే

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు శారీరక వ్యాయామాన్నికూడా అలవర్చుకోవాలని జ్ఞానాంబిక విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. హాకీ ఇండియా వందేళ్ల సంబరాల సందర్భంగా అన్నమయ్య హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బిటి కాలేజ్ హాకీ మైదానంలో నిర్వహించిన హాకీ పోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, సమన్వయం వంటి విలువలను పెంపొందిస్తాయి. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులైన యువతే దేశ అభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు.అనంతరం సీనియర్ బాయ్స్ మదనపల్లి టీం మొదటి స్థానం, ద్వితీయ స్థానం రాయచోటి టీమ్‌లు, జూనియర్ గర్ల్స్ రాయచోటి విన్నర్స్ కాగా, ఆరోగ్యమాత స్కూల్ టీం రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ బాయ్స్ దీక్షా స్కూల్ విన్నర్స్ గాను, ఆరోగ్యమాత స్కూల్ రన్నర్స్‌గా నిలిచారు. గెలుపొందిన వారికి మెడల్స్, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో అన్నమయ్య హాకీ అసోసియేషన్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ దివ్యభారతి ప్రసాద్ రెడ్డి, డిఎస్‌డిఒ చంద్రశేఖర్, డైరీడే చంద్రారెడ్డి, పీడీ జలజ, సీనియర్ హాకీ కోచ్ మణి, ఆర్గనైజర్లు నౌషాద్, కోచ్‌లు, వివిధ కళాశాలల, పాఠశాలలు క్రీడాకారులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్‌కు చెక్

ప్రజాశక్తి-పీలేరు

ముందస్తు వైద్య పరిక్షలతో కేన్సర్ నుండి రక్షణ పొందడం సాధ్యమేనని, అందుకు సంపూర్ణ అవగాహన అవసరమని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తలుపుల పిహెచ్‌సి అధికారులు సంయుక్తంగా పీలేరులో నిర్వహించిన జాతీయ కేన్సర్ దినోత్సవ కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొని కేన్సర్ నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీచైతన్య కళాశాల విద్యార్థులకు కేన్సర్ రకాలు, వాటి తీవ్రత, లక్షణాలు, చికిత్స మొదలగు అంశాలపై అవగాహన కల్పించి, సాధారణ స్థాయికి మించి శరీరంపై అసహజ కణాలను (కణితి) గుర్తిస్తే సత్వరం వ్యాధి నిర్ధారణ చికిత్సలు చేయించాలని పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనశైలితో పాటు ప్రమాదకర కారకాలనుండి యువత దూరంగా ఉండాలని సూచించారు. యువత పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, హెచ్‌పివి టీకా ఆవశ్యకతను ప్రతి యుక్తవయస్సు బాలిక గుర్తించాలని, శరీరంలోని అసాధారణ లక్షణాలు సంబంధిత వైద్యనిపుణులచే సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం ఏమాత్రం క్షేమదాయకం కాదని డాక్టర్స్ బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ రాజ సాహెబ్, ఐఎంఎ కార్యదర్శి చంద్రశేఖర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాల్మన్, డాక్టర్ వసీం, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎఎన్‌ఎంలు, విజయ కుమారి, ధనుంజయమ్మ, సిహెచ్‌ఒ ఆయేషా, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాన్యులను ఇబ్బందులు పెట్టొద్దు : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

రెవెన్యూ అధికారుల తప్పిదాలకు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో చమర్తి దృష్టికి తీసుకువచ్చారు. సుండుపల్లె తహాశీల్దార్ కార్యాలయ సిబ్బంది అవకతవకలు కారణంగా అనేకమంది పొజిషన్ సర్టిఫికెట్ రద్దు కావడంతో బాధితులు న్యాయం చేయాలని కోరారు. తక్షణమే స్పందిస్తూ చమర్తి తహాశీల్దార్‌తో ఫోన్లో మాట్లాడుతూ పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని, అవకతవకలు చేసిన సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నందలూరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన అవసాని శాంతమ్మ భూమిని బండి హరిబాబు అనే వ్యక్తి అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారని ఆయన దృష్టికి తీసుకురాగా నందలూరు తహాశీల్దార్‌తో ఫోన్లో మాట్లాడుతూ సమస్య పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేడికొండు రవికుమార్ నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, వీరబల్లి మండల అధ్యక్షులు భానుగోపాలరాజు, సిద్దవటం, సుండుపల్లె మండల ప్రధాన కార్యదర్శులు రామచంద్ర, ప్రసాద్ రాజు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు


కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో ట్రస్ట్ సభ్యులు, బ్యాంక్ అధికారులు

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు తన మిత్రుడు సిద్దార్ధ జ్ఞాపకర్థం ట్రస్ట్ చైర్మన్ కె.పార్ధసారధి మహిళలకు కుట్టు మిషనుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బిఐ మేనేజర్ సి.రఘునాధ్‌కుమార్ మాట్లాడుతూ మిత్రుడు జ్ఞాపకర్థం 100కు పైగా బ్యాచులకు టైలరింగ్ శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఆధునిక టైలరింగ్ పద్ధతుల ద్వారా మహిళలు ఉపాధి పొందుతున్నారని శిక్షణ పూర్తి చేసుకున్న మీరు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. బ్యాంక్ ద్వారా తాము కూడా సహకరిస్తామన్నారు. ఎస్‌బిఐ ద్వారా తక్కువ ప్రీమియంతో ఇస్తున్న ప్రమాదబీమా సదుపాయాలు వినియోగించుకోవాలన్నారు. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ డి. కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, క్రమశిక్షణతో బ్యాంకు లావాదేవీలు నిర్వహించాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ కె.పార్ధసారధి మాట్లాడుతూ మిత్రుడు సిద్దార్ధ జ్ఞాపకార్థం ఇప్పటివరకు స్వంత నిధులతో 104 బ్యాచుల ద్వారా 3200 మందికి టైలరింగ్ శిక్షణ ఇచ్చామని తెలిపారు. సంక్రాంతికి బట్టలు కుట్టే విధంగా శిక్షణ ఇచ్చే విధంగా సంక్రాంతికి వస్తున్నాం అనే నినాదంతో కొత్త బ్యాచ్ ప్రారంభించమన్నారు. బ్యాంక్ చీఫ్ చేతుల మీదుగా మహిళలకు టైలరింగ్ మెటీరియల్ కిట్లు, సబ్సిడీతో కుట్టు మెషిన్లు, శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు, మహిళలకు క్రీడల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ట్రస్ట్ కో-ఆర్డినేటర్, మహిళలు పాల్గొన్నారు.

వై.ఎస్.జగన్‌ను కలిసిన హేమంత్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



జగన్‌తో హేమంత్‌కుమార్

మాజీ సిఎం వై.ఎస్.జగన్‌ను శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి నట్లు వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై కూలంకుషంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం చేపట్టే వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారని అన్నారు.. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు, విద్యారంగంలో జరుగుతున్న అక్రమాల నివారణకు వైసిపి తరపున ధీటుగా పోరాడాలని దిశా నిర్దేశం చేశారన్నారు. సిఎం చంద్రబాబు మెడికల్ కళాశాలలను నిర్మించడం చేతకాక చేతులెత్తేసి పిపిపి విధానాన్ని సాకుగా చూపుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేస్తుం డటం దారుణమన్నారు. విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి కళాశాలలకు అందించాలన్నారు. వై.ఎస్.జగన్ ఆదేశాల మేరకు విద్యా ర్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య లభ్యత, కళాశాలల, పాఠశాలల పటిష్ట నిర్వ హణ, సకాలం లో ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులు వంటి వాటిపై రాష్ట్రవ్యాప్తంగా కార్యా చరణ రూపొంది స్తున్నామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వాన్ని ధీటుగా నిలదీస్తామని తెలిపారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సర్తాజ్, సిద్దయ్య

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్రోపాధ్యాయ సంఘం పుల్లంపేట మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వల్లూరు సిద్దయ్య లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో ఎస్‌టియు మండల సర్వసభ్య సమావేశం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి.నరేంద్రనాథ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా ఎస్‌టియు మాజీ జిల్లా అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ, రీజనల్ కన్వీనర్ ఎన్.నరసింహ వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సర్తాజ్, సిద్దయ్య మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులకు ఏ రకమైన సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. 2025 డిఎస్‌సి ఉపాధ్యాయులు మండలంలో ఏ సమస్య ఉన్న ఎస్‌టియు దృష్టికి తేవాలన్నారు.

శ్రీచరణిని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి: మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన రాయలసీమకు చెందిన శ్రీచరణిని ఆదర్శంగా తీసుకోవాలని రెడ్డి జెఎసి అధ్యక్షుడు పులి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. చిన్నతనం నుండి అంకుఠిత దీక్షతో అసాధ్యాలను సుసాధ్యం చేసి అలుపెరగని పోరాటం చేసి 125 కోట్లమంది భారతీయులను తలెత్తుకునేలా చేసి వరల్డ్ కప్ సాధించడంలో కీలక పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. త్వరలోనే ఆమెను కలిసి ఘనంగా సన్మానిస్తామని ఆయన తెలిపారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది మహిళలు క్రీడల్లో రాణించాలని కోరారు.


చేపల పెంపకం నీటిఫారంను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

చేపల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి-వీరబల్లి : చేపల పెంపకం, పరిశ్రమ రైతులకు ఎంతో లాభదాయకమని జిల్లా గ్రామీణ అభివృద్ధి సమస్త పథక సంచాలకులు నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సోమవరం, వంగిమళ్ళ గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడుతూ అత్యధిక పోష కాలను ఇచ్చే మాంసా హారంలో చేప ప్రధానమైనదన్నారు. చేపలు తింటే ఆరోగ్యం, మటన్, చికెన్‌తో పోల్చుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. చేపల పెంపకం ప్రస్తుత కాలంలో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. సెర్ప్ సంస్థతో రాష్ట్ర స్థాయిలో ఉదయ్ ఆక్వా సంస్థ ఒప్పందం చేసుకోవడం వల్ల మార్కెటింగ్, దానా, అధిక ఆదాయ మార్గాలు చూపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిపిఎం గంగార్జున, ఎపిఎం ఖాదర్ వలి, సిసిలు గంగాధరం, నాగేంద్ర, సుధాకర్, ఉదయ్ ఆక్వా ప్రతినిధి, అనిత, రైతులు పాల్గొన్నారు

ఎంఆర్‌పి ధరలకే ఎరువులను విక్రయించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఎరువులు, పురుగుమందుల అమ్మకాలలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించకుంటే డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని పీలేరు సహాయ వ్యవసాయ సంచాలకులు రమణ రావు తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖాధికారిని మంజుల తో కలిసి నిమ్మనపల్లిలోని ఎరువులు, పురుగుమందుల విక్రయాల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, స్టాకు రిజిస్టర్‌లను, క్రయ విక్రయా లకు సంబంధించిన బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే ఎరువలను, పురుగు మందులను రైతులకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు చేసే దుకాణదారుల లైసెన్సుల సైతం రద్దు చేయడానికైనా వెనకాడమని హెచ్చరించారు. ఎరువుల దుకాణాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తామన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయించే దుకాణదారుల పై రైతుల కూడా నేరుగా తమకు సమాచారం అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు గణేష్, డీలర్లు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : మండలంలోని ఎరువులు, విత్తన డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కే.శివశంకర్ అన్నారు. మండలంలోని ఎరువులు, విత్తన డీలర్ల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీలర్ల బిల్‌బుక్కులు, స్టాక్ రిజిస్టర్లు, ఫిజికల్ స్టాక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా, డిఎపి వంటి ఎరువులను రైతుల పట్టాదారు, ఆధార్ ఆధారితంగా పంటను ఆధారం చేసుకుని ఇవ్వవలసిందిగా కోరారు. అనంతరం గోదాముల్లో స్టాక్సను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికా పి.సందీప్, బొజ్జవారిపల్లి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎ.సుధీర్ వర్మ పాల్గొన్నారు.


కలికిరి : ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎడిఎ రమణారావు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి : వైసిపి


రాయచోటి : రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి -రైల్వే కోడూరు

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను కూటమి ప్రభుత్వం ఆపాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పేరిట కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మైసూరువారిపల్లి పంచాయతీ శాంతినగర్‌లో వైసిపి సీని యర్ నాయకులు నర్సారెడ్డి బొప్పాయి ఫ్యాక్టరీ ఆవరణలో కాలనీ వాసులతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగేంద్ర, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, సర్పంచ్ బుడిగి శివయ్య, కొప్పుల శంకరయ్య, వార్డు మెంబర్ సంటి శివాజీ, మౌలా, నవీన్‌పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్:** సమష్టి కృషితో వైసిపిని మరింత బలోపేతం చేసుకుందామని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి మున్సిపల్ పరిధిలోని 29 30 31 వార్డులలో వైసిపి నేతలు, కార్యకర్తలతో కలిసి రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాల లను ప్రయివేట్ వారికి అప్పుజెప్పడం వల్ల ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ తీరును ప్రశ్నించేందుకు ప్రజల నిబద్ధతను నిరూపించేందుకు కోటి సంతకాల రూపంలో గవర్నర్‌కు అందజేస్తామన్నారు. పార్టీకి కార్యకర్తల మూల స్తంభాలని, వారికి అన్యాయం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించ బోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైసిపి నేతలు బెపారి మహమ్మద్ ఖాన్, కొలిమి హారుణ్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు **కలికిరి :** మెడికల్ కళాశాలల ప్రయి వేటీకరణ అడ్డుకుంటామని, అందుకే వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ పేర్కొన్నారు. శుక్రవారంమెడికల్ కాలేజీలు ప్రయి వేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల కార్యక్ర మంలో భాగంగా పట్టణంలో ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, వైసిపి యువ నాయ కుడు వేంపల్లి బాలాజీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మాజీ సిఎం పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు, పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు మెడికల్ కళాశాలలను మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత పిపిపి విధానంతో వైద్య విద్యను ప్రయివేట్‌పరం చేసి పేద విద్యార్థుల కడుపుకొడుతుందన్నారు. వైద్య విద్య, పేదలకు వైద్యం మరింత భారంగా అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల మైనారిటీ నాయకులు వేంపల్లి ఫయాజ్, వేంపల్లి ఖాదర్ భాష,నజీర్ సౌకత్ అలీ, వాజిద్, రఘు, ముబారక్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపిన వందేమాతరం గేయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలో ఎంఇఒలు పద్మావతి, నారాయణ, ఎంపిడిఒ రమేష్‌బాబు హెచ్ఎంలు, ఉపాధ్యా యులు, పోలీసులు, విద్యా ర్థులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. జడ్‌పి హైస్కూల్(తెలుగు), ఉర్దూ హైస్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్, తవళం జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండా పట్టుకొని ర్యాలీ నిర్వహించి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఎన్‌సిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్, విద్యార్థులు కవాతు చేస్తూ జెండా వందనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అంజాద్ అలీ ఖాన్, భాస్కరన్, అపర్ణాదేవి, ఉపాధ్యాయులు వెంకటగోపాల్, నాదిర్‌షావలి, సుధాకర, షబ్బీర్, హరి ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** వందే మాతరం150వ స్మారకోత్సవం సందర్భంగా ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యా ర్థులు కలికిరి క్రాస్ రోడ్ వరకు ర్యాలీగా వచ్చి మానవహారం కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆదినారా యణరెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు. కృషివిజ్ఞాన కేంద్రంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల ఆధ్వ ర్యంలో శాస్త్రవేత్తలు సిబ్బంది వందేమాతరం పాడి అప్పటి స్వతంత్ర ఉద్యమం నాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు.కార్యక్రమంలో ఎఎస్ఐ నరసింహులు, ఎస్‌బి కానిస్టేబుల్ మునిరాజా, కానిస్టేబుల్ రఫీ విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు:** స్వాతం త్ర్యోద్యమంలో జనానికి జాతీయతాభావాన్ని, చైతన్యాన్ని నింపుకు వచ్చిన వందేమాతరం గీతం 150వ స్మారకోత్సవాన్ని పీలేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్‌పి హైస్కూల్ ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా జాతీయ జెండాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాల, మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలు (తెలుగు,ఉర్దూ,) ప్రాథమిక పాఠశాలలు, అన్ని కార్యాలయాలలో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, వెంకటాద్రి, శ్రీధర్, ప్రిన్సిపల్ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె :** మదన పల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో 'వందేమాతరం' గీతం 150వ స్మారకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యూని వర్సిటీ ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి యూనిట్లు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సంద ర్భంగా విద్యార్థులు యూనివర్సిటీ ప్రాంగణంలో 150వ అంకెతో కూడిన వందేమాతరం అక్షరాల ఆకారంలో నిలబడి దేశభక్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు చంద్రశేఖర్, స్కౌట్స్, గైడ్స్ ఇన్‌ఛార్జి శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌జి రంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

ఆచార్య ఎన్‌జి రంగా 125 వ జయంతి వేడుకలను కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త మంజుల మాట్లాడుతూ వ్యవ సాయ, అనుబంధ రంగాలలో రైతాంగానికి ఆచార్య ఎన్‌జి రంగా ఎనలేని సేవలు అందిం చారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీగా ఉన్న పేరు ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీగా 1996లో మార్చబడిందని చెప్పారు. శాస్త్రవేత్త డాక్టర్ కె.మాధురి మాట్లాడుతూ ఎన్‌జి రంగా గుంటూరు జిల్లాలోని నిడుబ్రోలులో జన్మించారని, రాజకీయవేత్త, రైతు బాంధవుడు, చిన్న సన్నకారు రైతుల అభివృద్ధి కోసం పాటుపడ్డారని చెప్పారు. తదుపరి ఆచార్య ఎన్‌జి రంగా చిత్రపటానికి అందరూ పుష్పాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్న మయ్య జిల్లాకు చెందిన ఇద్దరు అభ్యు దయ రైతులైన రాజామణిరెడ్డి, నర్రా వాండ్లపల్లి హేమలత, మర్రికుంటపల్లిని కెవికె సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది అభ్యుదయ రైతులు, కెవికెలో శిక్షణ పొందుతున్న ఫైనల్‌ఇయర్ అగ్రికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవికె కో-ఆర్డినేటర్ మంజుల


ప్రభుత్వ స్థలంలో ఉంచిన సామగ్రిని తొలగింపజేస్తున్న విఆర్ఒ

ప్రభుత్వ స్థలం స్వాధీనం

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని తూముకుంట పంచాయతీ కొండకిందపల్లి ఎగువమూలకు చెందిన గ్రామస్తులందరూ శుక్రవారం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై డిప్యూటీ తహశీల్దార్ నారాయణరావుకు ఫిర్యాదు చేశారు. ప్రధాన రహదారిపై పక్కన ప్రభుత్వ స్థలం ఉండడంతో గ్రామస్తులందరూ 30 సెంట్లు స్థలాన్ని వినాయకుడి గుడి నిర్మించుకోవాలని ఆ స్థలంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ గత పది సంవత్సరాలకు కొనసాగి స్తున్నారు. అదే గ్రామానికి చెందిన మావిళ్ళ. బోడెప్ప, మామిళ్ళ. వీరభద్ర ,మామిళ్ళ. ప్రసాద్ అనే ముగ్గురు ఆ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి సర్వేనెంబర్ 223లో తమకు పట్ట ఉందని ప్రజలు మభ్యపెడుతూ వుండే వారని చెప్పారు. స్పందించిన డిటి విఆర్ఒ,రెవెన్యూ సిబ్బందితో ఆక్రమణకు గురైన స్థలం ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగించి చదువును చేయించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఈశ్వర్ రెడ్డి, వెంకటాద్రి నాయుడు, శివకుమార్, భాస్కర్‌నాయుడు, నాగ శేఖర్ నాయుడు, రమేష్ నాయుడు, చలపతి నాయుడు, శ్రీనాథ్, అప్పనాయుడు, రవికుమార్, గ్రామస్తులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ఎంఇఒ-2 వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఎంప్లాయిస్ కాలనీలో కార్తిక మహోత్సవ కార్యక్రమ ముఖ్య అతిథిగా ఎంఇఒ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంర క్షించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరూ జీవవైవిధ్య సంరక్షణ కోసం పాటుపడి పర్యావరణానికి హాని చేకూర్చే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని కోరారు. పాఠశాల విద్యార్థులకు మొక్కల పెంపకం, ఆవశ్యకతను, ఉపయోగాలను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని వృక్షాలు అయ్యేంత వరకు రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు రెడ్డప్ప, రఘుపతిరాజు, ప్రధానోపాధ్యాయులు హెచ్‌సి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీదేవి, షాహ నాజున్నిస ప్రశాంతి, సుహాసిని, విద్యార్థులు, స్కూల్ కమిటీ సభ్యులు, తల్లి దండ్రులు, అటవీశాఖసిబ్బంది శ్రీను, రెడ్డయ్య, రమణ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంఇఒ, అటవీశాఖ అధికారులు



జగన్నాథశాస్త్రిని సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి- కలకడ

కవిగా పేరుపొందిన ఉపాధ్యాయుడు లోక జగన్నాశాస్త్రిని పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో తెలుగు పండితులుగా విధులు నిర్వహిస్తున్న ఆయన పేరు ప్రతిష్టలు తెచ్చుకున్న వ్యక్తిగా నిలిచారని ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య కొనియాడారు. తెలుగు భాషను విద్యార్థులకు సులభ శైలిలో నేర్పిస్తూ విద్యార్థులతో మమేకమై విద్యార్థులకు బోధన సామర్థ్యాలు పెంచుతూ వారిలో ఒకరిగా మెలిగే ఉపాధ్యాయుడిగా పేరుగాంచారని పేర్కొన్నారు. నిగర్వి, నిస్వార్థపరుడు, నిరాహాడంబరుడుగా పేరు గాంచిన ఉపాధ్యాయుడు మా పాఠశాలకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. అనంతరం ఆయనను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -చిట్వేలి

మండల కేంద్రం చిట్వేలిలోని జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు బి.దుర్గారాజు తెలిపారు. శుక్రవారం పాఠశాల స్థాయి నుంచి జిల్లాస్థాయి నైపుణ్య పోటీలకు ఎంపి కైన వారిని రాయచోటిలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల నుంచి వృత్తి విద్య విభాగానికి సంబంధించి ఐటి ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్‌కు చెందిన మూడు ప్రాజెక్టులు జిల్లా స్థాయికి వెళ్లగా అందులో రఫీ, ఎం.చేతన, కె.నవిత విద్యార్థులు రూపొందించిన డిహైడ్రేటెడ్ ఫ్రూట్ ఇండస్ట్రీ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. చిన్నబాబు, ఎస్.బృందా, దీక్ష విద్యార్థులు తయారు చేసిన కంప్యూటర్ నెట్ వర్కింగ్ ప్రాజెక్టు జిల్లాస్థాయి తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలు ఈనెల 14న విజయవాడలో జరగనున్నాయని తెలిపారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఫిర్యాదు


నిర్మాణంలో ఉన్న భవనం

ప్రజాశక్తి- కలకడ : అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను నిలుపుదల చేయాలని బాలయ్యగారిపల్లి గ్రామస్తులు తహశీల్దార్ మహేశ్వరిబాయ్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సిద్దేశ్వరస్వామి చెరువు మరవ నుంచి బాలయ్య గారి పల్లి పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు మీరు పోవడానికి ఏర్పాటుచేసిన కాలువ మీద కొందరు కాలువను కబ్జా చేసుకుని ఇంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కాలువపై నిర్మించిన కట్టడాలను నిలుపుదల చేసి బాలయ్యగారి పల్లి గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు స్పందించిన తహశీల్దార్ వెంటనే పరిశీలించి కాలువను ఆక్రమించి ఉంటే చర్యలు తీసుకొని భవన నిర్మాణాన్ని నిలుపుదల చేస్తామని రైతులకు హామీ ఇచ్చారని తెలిపారు. తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వారిలో నరసింహులు, రెడ్డప్ప, కృష్ణ, శ్రీనివాసులు, భాస్కర, జీవీ రమణ, నాగేశ్వర, గ్రామస్తులు, రైతులు ఉన్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ మధు రామ చంద్రుడు కథనం మేరకు..మదనపల్లెకు చెందిన సాబ్‌జాన్, అమ్మాజీ దంపతులు ద్విచక్రవాహనంలో అంగళ్లుకు బయల్దేరారు. మార్గమధ్యంలో విశ్వం కళాశాల వద్ద నీరుగట్టువారిపల్లికి చెందిన హరీష్ బైకులో ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు విచారిస్తున్నారు.

కారు ఢీకొని రైతుకు..

మదనపల్లె అర్బన్: కారు ఢీకొని రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపిన వివరాల మేరకు.. ముదివేడు పంచాయితీ, తూపల్లెకు చెందిన రైతు ఏ.శంకర్ రెడ్డి వ్యవసాయ పొలం వద్దకు నడిచి వెళుతుండగా, దాదంవారిపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన కారు రైతును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాధితుని పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి కి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో హోంగార్డుకు..

మదనపల్లె అర్బన్ : రోడ్డు ప్రమాదంలో హెూంగార్డు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముదివేడు పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న హరి విధుల నిమిత్తం మదనపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. మార్గ మధ్యలోని విశ్వం కళాశాల వద్ద కుక్క అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి బాధితుడిని మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు..సంద్రమాకులపల్లి పంచాయతీ, గానుగుల గడ్డకు చెందిన సుభద్రమ్మ కుటుంబ సమ స్యలతో తీవ్ర మనస్థాపం చెందింది. పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పుంగనూరు పోలీసులు విచారిస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


శివ(ఫైల్ ఫొటో)

తల్లిదండ్రులు మందలించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. రెండో పట్టణ సిఐ రాజారెడ్డి కథనం మేరకు.. రామా రావు కాలనీకి చెందిన నాగరాజు కుమారుడు శివ (24) పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు మందలిం చారు. తీవ్ర మనస్తాపానికి గురైన శివ ఎలుకల మందు తాగి ఆత్మహత్య కు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు.